సాక్షి
నిర్మల్

మంగళవారం ; 14 ; మార్చి ; 2023

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /21.1

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. రాత్రి కాస్త చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మొల్లమాంబ జయంతి



కవయిత్రికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కుమ్మర సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ 583వ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ హాజరై కవయిత్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. రామాయణాన్ని అందరికీ అర్థమయ్యే రీతిలో తెలుగులో రచించిన ప్రతిభాశీలి మొల్లమాంబ అని అన్నారు. కుమ్మర సంఘం జిల్లా సభ్యులు పాల్గొన్నారు.

బాసరలో నేడు వాటర్ ప్లాంట్ ప్రారంభం

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో భక్తుల కోసం మంగళవారం వాటర్‌ప్లాంట్ ప్రారంభించనున్నట్లు ఆలయ ఈవో విజయ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. దివిస్ ల్యాబొరేటరీ లిమిటెడ్ కంపెనీ రూ.కోటి వెచ్చించి ఆలయంలో నాలుగు వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వాటర్ ప్లాంట్‌లను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రారంభిస్తారని వెల్లడించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్–2, గ్రూప్ 3 పోటీ పరీక్షలకు ఇచ్చే 60 రోజుల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన నిరుద్యోగులు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

కరాటేలో కడెం యువకుడి ప్రతిభ



భీమేశ్‌కు గోల్డ్ మెడల్ అందజేస్తున్న మాస్టర్లు

కడెం: మండలంలోని చిట్యాల్ గ్రామానికి చెందిన భీమేశ్ అంతర్రాష్ట్ర కరాటే పోటీలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈనెల 12న వేములవాడ పట్టణంలో జరిగిన పోటీల్లో సీనియర్ కటా విభాగంలో భీమేశ్ ప్రథమ స్థానంలో నిలిచాడు. టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ఎంఏ.మన్నన్, పోలీస్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ వసంత్‌కుమార్ గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ కామురవెల్లి భూమేశ్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



డాక్టర్ నిఖిలారాణిని సన్మానిస్తున్న నయనారెడ్డి

సారంగపూర్: మహిళలు అన్నిరంగాల్లో తమ ప్రతిభను చాటుకుని ముందుకు సాగాలని జిల్లా టీకాల అధికారి డాక్టర్ నయనారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో సోమవారం మహిళా సిబ్బందిని సత్కరించారు. మూడేళ్లుగా కరోనా మొదలుకుని కంటివెలుగు కార్యక్రమాలతోపాటు రోజువారీ ఆరోగ్య కార్యక్రమాల్లో గ్రామాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఫీల్డ్ సిబ్బంది చేసిన సేవలు మరువలేనివన్నారు. తాజాగా కంటివెలుగు కార్యక్రమాల్లోనూ సేవలందిస్తున్నారని తెలిపారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నిఖిలరాణి, ఎంపీడీవో సరోజ, పీహెచ్‌సీ వైద్యులు సుభాష్, వేదవ్యాస్, మోయిన్ అలీ, ఆరోగ్య పర్యవేక్షకుడు కృష్ణమోహన్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ వచ్చారు

నిర్మల్: నిర్మల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎట్టకేలకు వచ్చారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ జేవీడీఎస్.ప్రసాద్‌ను నిర్మల్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నియమించింది. నెలలు గడుస్తున్నా ఆయన బాధ్యతలు తీసుకోలేదు. ఎట్టకేలకు ఆయన సోమవారం సాయంత్రం నిర్మల్ చేరుకున్నారు. ఆయనను జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, చర్మవ్యాధుల వైద్యుడు అమరేశ్వర్ ఆహ్వానించారు. మంగళవారం ప్రిన్సిపాల్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

విశ్వవేదికపై మన భీమ్..



- ఆంగ్లేయులపై పోరాడిన అడవి బిడ్డ
- ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో ఆకట్టుకున్న పాట
- 'నాటు.. నాటు'కు ఆస్కార్..
- ప్రపంచవ్యాప్తంగా మన వీరుడిపై చర్చ



కుమురం భీమ్ కుటుంబసభ్యులు

నిర్మల్:
"భీమా..
నినుగన్న నేల తల్లి
ఊపిరిబోసిన సెట్టూసేమా
పేరు బెట్టిన గోండు జాతి
నీతో మాట్లాడుతున్రు
ఇనపడుతుందా..!"

అవ్.. భీమా..! ఇవ్వాళ మన అడవుల జిల్లానే కాదు, ఆదివాసీ బిడ్డలే కాదు, యావత్ ప్రపంచమే నువ్వంటే ఎవరో తెలుసుకుంటుంది. నీ వెనుకున్న కథేందో గూగుల్‌లో వెతుకుతున్నరు. ఈ అడవి తల్లికి పుట్టి, ఈ భూతల్లి పాలు తాగి, ఇక్కడి సెట్టూసేమా, నీటిబొట్టు కోసం నువ్వు జేసిన 'జల్ జంగల్ జమీన్..' జంగ్‌ను యాది జేసుకుంటున్నరు. అడవి జోలికొస్తే, అన్నెంపున్నెం ఎరుగని ఆదివాసీల మీదికొచ్చిన ఆంగ్లేయ, నైజాం సేనలతో ఎంతటి పోరుజేసినవో చదువుతున్నరు. కారడువుల్లో కాల్మొక్తా బాంచేననే రోజులు పోయినాయంటూ.. కొర్రాసు నెగడోలే మండిన నీ గాథను చర్చిస్తున్నరు. భీమా.. ఇదంతా ఎందుకో తెలుసా..!? నీ పేరు పెట్టి తీసిన 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాకు ఆస్కార్ అవార్డు వచ్చినందుకే. అందులో తెల్లోడిని ఇరగదీసేలా.. ప్రతీ భారతీయుడు గర్వపడేలా రాసిన 'నాటు.. నాటు..' పాటను ప్రపంచం మెచ్చింది. హాలీవుడ్‌లోని డాల్బీ థియేటర్ వేదిక ఆ సినిమా కథపై, అందులో భీమా..! నీ వీరోచిత గాథపై విశ్వవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. ఈ గడ్డపై నీవు పుట్టినందుకు ఆదివాసీల ఖిల్లా.. అడవుల జిల్లా అయిన ఉమ్మడి ఆదిలాబాద్ మురుస్తోంది.

ఆస్కార్ అవార్డు రాకతో..

ఎక్కడ ఆదిలాబాద్ జిల్లా.. ఎక్కడ ఆస్కార్ వేదిక దానికి దీనికి సంబంధమేమిటి? అంటే పక్కాగా ఉందనే చెబుతాం. ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ట్రిపుల్‌ఆర్(ఆర్‌ఆర్‌ఆర్) సినిమాలో ఒక పాత్ర మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజుదైతే.. మరో వీరోచిత పాత్ర మన అడవి తల్లి కన్న ఆదివాసీ బిడ్డ కుమురం భీముడిది. నిజ జీవిత చరిత్రకు కాసింత సినీకథను జోడించి తన పాత్రను తీర్చిదిద్దిన తీరు అందరినీ ఆకట్టుకుంది. అప్పటి నుంచే దేశ వ్యాప్తంగా కుమురం భీముడి చరిత్రను లోతుగా ఆరాతీయడం మొదలైంది. తాజాగా ఆ సినిమాలోని 'నాటు.. నాటు' పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో ఆ సినిమా, అందులోని పాత్రలపైనా ప్రపంచ వ్యాప్తంగా చర్చ మొదలైంది. ప్రధానంగా మారుమూల అటవీ ప్రాంతంలో, ఎలాంటి అధునాతన ఆయుధాలు లేకుండా జల్ జంగల్ జమీన్ నినాదంతో భీమ్ సాగించిన పోరు అందరినీ ఆకట్టుకుంటోంది.

వీరుడిగా ఎదిగిన పోరుబిడ్డ..

అందరిలాగే సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టిన భీమ్ స్థానిక పాలకుల ఆకృత్యాలను సహించేవాడు కాదు. అడవుల్లోకి చొచ్చుకొస్తున్న ఆంగ్లేయులపై నిర్మల్‌గడ్డ మీద వీరోచిత పోరు సాగించి వీరమరణం పొందిన రాంజీగోండు సహా వెయ్యిమంది అమరుల గాథతో స్ఫూర్తి పొందాడు. రాంజీ చూపిన పోరుబాటను ఎంచుకుని తాము నమ్ముకున్న అడవులు, అన్యాయాన్ని సహించని ఆదివాసీ యువతను అండగా చేసుకుని నిజాం సైన్యంపై పోరాటం చేశాడు. ఇక్కడి నీళ్లు, అడవులు, భూములు తమవే అని ప్రకటించాడు. అలా.. తను నమ్మిన పోరులోనే నమ్మకద్రోహంతో అమరుడయ్యాడు. కానీ.. ముందుతరాలకు తరగిపోని పోరాటస్ఫూర్తిని నింపాడు.

ఆదివాసుల్లో ఆనందం..

సిర్పూరు(యూ) మండలం పెద్దదోబ గూడెంలో ఉంటున్న కుమురం భీమ్ వారసులు సైతం చాలా సంతోషం వ్యక్తంచేస్తున్నారు. భీమ్ కోడలు భాగుబాయి, మనుమలు కుమురం సోనేరావు, కుమురం భీమ్ వారి కుటుంబసభ్యులతోపాటు ఆదివాసీ గూడేలన్నీ సంబరాల్లో మునిగిపోయాయి. తాము దేవుడిగా భావించే భీముడి పేరిట తీసిన సినిమాలోని పాటకు విశ్వవేదికపై అవార్డు రావడం, ప్రపంచవ్యాప్తంగా భీమ్ పాత్రను చర్చించుకోవడంపై ఆదివాసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా తీరని వెతలు..

రాంజీగోండు, కుమురం భీమ్.. ఇలా ఎంతోమంది ఆదివాసీ వీరులు పోరాటాలు చేసినా ఇప్పటికీ అడవి బిడ్డల బతుకుల్లో పూర్తి వెలుగులు నిండలేదు. అడవినే నమ్ముకుని బతుకుతున్న ఆ గూడేల్లో సరైన సౌకర్యాలు, వసతులూ లేవు. ఇంకా.. కరెంటు చూడని బిడ్డలున్నారు. ఇప్పటికీ తారురోడ్డెక్కని గ్రామాలున్నాయి. తాగునీటికి చెలిమలే దిక్కవుతున్నాయి. ఆపదొచ్చినా, అనారోగ్యమైనా.. కోసుల దూరంలోని ఆస్పత్రికి నడిచి వెళ్లాల్సిన పరిస్థితే. 'ఆస్కార్' వేదికగా యావత్ ప్రపంచం కుమురం భీముడిని తలుస్తున్నందుకు సంబురపడుతూనే.. 'ఓ.. ప్రజాప్రతినిధులారా, నేతలారా, అధికారులారా, సంఘసేవకులారా.. సినిమావాళ్లారా..! ఎవరైనా సరే.. ఒక్కసారి మాదిక్కు చూడండి. ఒక్కసారి మా గూడేలకు రండి. మా గోసలు తీర్చండి' అంటూ ఆదివాసీ గూడేలు గోడు వెళ్లబోసుకుంటున్నాయి.

ఆసిఫాబాద్‌కు వచ్చిన రాజమౌళి

కుమురంభీం యోధుడిని తన సినిమాలో ప్రధాన పాత్రగా తీసుకున్న దర్శకుడు రాజమౌళి గతేడు ఏప్రిల్‌లో ఆసిఫాబాద్‌కు వచ్చారు. భీంకు నివాళ్లు అర్పించారు. ఆయన పోరాట చరిత్రను తెలుసుకున్నారు. అప్పటి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, కుమురంభీం మనవడు సోనే రావుతోనూ సమావేశం అయ్యారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లో నడుస్తున్న బెలూన్ థియేటర్‌ను సందర్శించారు. 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా స్థానికులతో కలసి చూసి సంతోషం వ్యక్తం చేశారు.

మా దేవుడు..



మా మామ కుమురం భీముడంటే మాకు దేవుడి లెక్క. మావోళ్ల పడుతున్న కష్టాలను తట్టుకోలేక పోరాటం జేసిండు. ఆయన కొడుకు మాధవరావునే నేను పెండ్లిజేస్కున్న. ఈ ఇంటి కోడలైనందుకు గర్వపడుతున్న. నా చి న్న కొడుకుకు మా మామ భీమ్ పేరే పెట్టినం.

– కుమురం భాగుబాయి, భీమ్ కోడలు

సంతోషంగా ఉంది..



అడవిలో పుట్టి.. అడవినే తల్లిగా నమ్మినోళ్లం. ఈ అడవి తల్లితోపాటు ఈ భూమి, ఇక్కడి నీళ్లు మనవేనంటూ మా తాత కుమురం భీమ్ చేసిన పోరాటం ఎప్పటికీ యాదిమర్వం. మా ఆదివాసీ వీరుడి పేరు మీద తీసిన సినిమా పాటకు అవార్డు రావడం సంతోషంగా ఉంది. రాజమౌళి సారును యాదిజేస్కుంటం.

– కుమురం సోనేరావు, భీమ్ మనుమడు

ఇక్కడి ప్రాంతాలన్నీ చూడాలి..



రాజమౌళి సార్ దర్శకత్వంలోని 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలోని 'నాటు.. నాటు..' పాటకు ఆస్కార్ రావడం, అందులో మా ముత్తాత కుమురం భీమ్ పాత్ర ఉండటం మాకు గర్వకారణం. సినిమా గురించే కాకుండా ఇక్కడి మా ప్రాంతాలను అందరూ చూడాలి. మా ఆదివాసులు పడుతున్న కష్టాలపై స్పందించాలి.

– కుమురం వనిత, భీమ్ మునిమనుమరాలు

ప్రజా ఫిర్యాదులపై స్పందించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

నిర్మల్‌టౌన్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాంబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. మొత్తం 19 అర్జీలు అందగా, ఎక్కువగా భూ సంబంధిత, డబుల్ బెడ్‌రూం దరఖాస్తులే ఉన్నాయి.

- జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్‌కు చెందిన ఆంజనేయ గణేశ్ మండలి, జంగల్ హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు నిర్మల్ రూరల్ మండలం నాగయిపేటకు చెందిన 30 గుంటల భూమిని అప్పటి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చిందని, దానిని కొంతమంది కబ్జా చేయాలని చూస్తున్నారని ఫిర్యాదు చేశారు.
- సారంగాపూర్ మండలం కౌట్ల (బి) గ్రామానికి చెందిన దివ్యాంగుడు రాజేశ్వర్ వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలకు, 2018లో వాచ్‌మెన్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నానని, పూర్తి అర్హత ఉన్నా ఉద్యోగం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశాడు. అంతకుముందు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపాడు.

ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్..



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా వాట్సాప్ నంబర్ 8712659599 కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అన్ని ప్రభుత్వ సేవలు ఒకేచోట..

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి

నిర్మల్‌టౌన్: సమీకృత కలెక్టర్ భవన ప్రారంభోత్సవం తర్వాత ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకేచోట అందుతాయని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సమీకృత కలెక్టరేట్ భవనం పనులను కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రాంగణంలో గార్డెనింగ్, మొక్కలు నాటడం, సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన సౌకర్యాలు, సకల హంగులతో నిర్మిస్తున్న కలెక్టరేట్ భవన సముదాయాన్ని ఏప్రిల్ మొదటి వారంలో సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. వైద్య కళాశాల భవన నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభోత్సవం, సుమారు 2 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ అదే రోజు ఉంటాయని వివరించారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

సారంగపూర్: రంజాన్‌లోగా ఈద్గా నిర్మాణ పనులను పూర్తి చేయించాలని జిల్లా అధికారులతోపాటు కాంట్రాక్టర్‌ను రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశించారు. సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామ శివారులో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో 8.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈద్గా పనులను సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఈద్గావద్ద మినార్ల ఏర్పాటు, ప్రధాన ద్వారం నిర్మాణం, ప్రహరీగోడ, టైల్స్, మైక్‌సెట్ ఏర్పాట్లు తదితర పనుల గురించి ఇంజినీరింగ్ విభాగం అధికారులతోపాటు మైనార్టీ సంక్షేమశాఖ అధికారులతో చర్చించారు. పనుల పురోగతి తదితర అంశాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ 15లోపు పనులన్నీ పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నిమతాల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. అన్ని మతాల పర్వదినాలకు సీఎం కేసీఆర్ కానుకలను పంపిణీ చేయడంతోపాటు ఆలయాలు, మసీదులు, క్రైస్తవ ప్రార్థనా మందిరాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారని వివరించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎర్రవోతు రాజేందర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇంజినీరింగ్, మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు ఉన్నారు.

ఫిష్ మార్కెట్ పనులు పరిశీలన..

నిర్మల్‌టౌన్ : జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఫిష్ మార్కెట్ పనులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. రూ.55 లక్షలతో మార్కెట్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. మరో రూ.10 లక్షలతో ఫ్లోరింగ్ నిర్మాణం చేపట్టి, 20 రోజుల్లో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మంత్రి వెంట కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

నిర్మల్ రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వరుణ్‌రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇంటర్మీడియెట్ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్ష సమయంలో విద్యార్థులపై ఒత్తిడి ఉంటుందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. వేసవి దృష్ట్యా అన్ని కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రశ్న పత్రాలు తీసుకువెళ్లడం, తీసుకు రావడంలో పూర్తి భద్రత , కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి వచ్చేలా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుంటే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు నేరుగా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. http://www.tsbie.cgg.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించే పరీక్షలకు ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగతాయని తెలిపారు. జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు, ఇతర ఏర్పాట్లను పూర్తి చేశామని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 15,201 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ఇప్పటి వరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోని విద్యార్థులు నేరుగా ఇంటర్మీడియట్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునేలా చూస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఐఈవో పరుశరామ్, ఆర్డీవో స్రవంతి, డీఎంహెచ్‌వో డాక్టర్ ధన్‌రాజ్, పోస్టల్, విద్యుత్, ఇతర శాఖల అధికారులు, పాల్గొన్నారు.

'ట్రిపుల్‌ఆర్'కు ఆస్కార్‌పై కళాకారుల హర్షం



అభినందన సభలో కళాకారులు

నిర్మల్‌టౌన్: తెలుగు సినిమా ఆర్‌ఆర్‌ఆర్‌లోని నాటు.. నాటు.. పాటకు ఆస్కార్ అవార్డు రావడంపై జిల్లా చలనచిత్ర టీవీ కళాకారుల అసోసియేషన్ అధ్యక్షుడు అడిచర్ల రాజు హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎంతో శ్రమకోర్చి చిత్రీకరించిన నాటు.. నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం ప్రతీ కళాకారుడికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కోటగిరి నరసయ్య , క్యాషియర్ సామర్ల రాజన్న, సెక్రెటరీ ధనలకోటి కృష్ణవర్మ, పీఆర్వో చెట్టిపల్లి కమలాకర్, తాడూరి రాజేంద్ర, తోట సూర్యప్రకాశ్, తునికి హరి, మేరీమాత, పద్మ, యాంకర్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ చరిత్రలో శాశ్వతమై నిలిచింది

ఆస్కార్ పురస్కారంతో తెలుగు జానపదం ప్రపంచ చరిత్రలో శాశ్వతమై నిలిచిందని ప్రముఖ పద్యకవి బి.వెంకట్, సామాజిక సేవ క్షేత్రం అధ్యక్షుడు తోడిశెట్టి పరమేశ్వర్ ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటు.. నాటు.. పాటకు ఆస్కార్ అవార్డు రావడం ప్రతీ భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ టీంకు మంత్రి శుభాకాంక్షలు

నిర్మల్‌టౌన్: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు.. నాటు.. పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో సినిమా బృందానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. దర్శకుడు రాజమౌళి, నటులు రాంచరణ్, జూనియర్ ఎన్టీఆర్, సంగీత దర్శకులు యంయం. కీరవాణి, పాట రచయిత చంద్రబోస్, చిత్ర బృందాన్ని అభినందించారు. పోరాట యోధులు కుమురంభీమ్, అల్లూరి సీతారామరాజుకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం తీసుకువచ్చారని ప్రశంసించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు గర్వకారణమన్నారు.

ఆదాయం పెంపుపై దృష్టి పెట్టాలి

- భైంసా మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, పక్కన చైర్‌పర్సన్

భైంసాటౌన్: పట్టణం అభివృద్ధి చెందాలంటే మున్సిపాలిటీకి ఆదాయం కూడా బాగుండాలని, మున్సిపాలిటీ ఆదాయం పెంపు మార్గాలపై కౌన్సిల్ దృష్టి పెట్టాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో 2023–24 ఆర్థిక సంవత్సర ముందస్తు అంచనా బడ్జెట్, 2022–23 సవరణ బడ్జెట్ ఆమోదంపై సోమవారం సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ సబియాబేగం అధ్యక్షతన జరిగిన సమావేశానికి కలెక్టర్ వరుణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూ.31.34కోట్లతో 2022–23 సవరణ బడ్జెట్, రూ.18.96కోట్లతో 2023–24 అంచనా బడ్జెట్‌లో పొందుపర్చిన అంశాలను కౌన్సిల్ సమావేశంలో వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణం పెరుగుతున్న నేపథ్యంలో ఖర్చులు కూడా పెరుగుతాయన్నారు. మున్సిపాలిటీ ఆదాయం పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇందులో భాగంగా వార్షిక అద్దె విలువ ఆధారంగా ఆస్తిపన్నుపై ఏటా 5 శాతం పెంపు, కొత్త ట్రేడ్ లైసెన్స్ జారీ, రెన్యూవల్ ద్వారా ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు. భువన్ సర్వే ఆధారంగా పట్టణంలోని నివాస, వ్యాపార సముదాయాలను పన్ను పరిధిలోకి తేవాలని సూచించారు. నల్లా చార్జీలు, చెత్త సేకరణకు యూజర్ చార్జీలు, ఖాళీస్థలాలపై పన్ను, లేఅవుట్, భవన నిర్మాణ అనుమతుల ద్వారా ఆదాయం పెంచుకోవచ్చన్నారు.

బడ్జెట్‌లో మార్పులు చేయండి...

ప్రస్తుత అంచనా బడ్జెట్‌లో తగిన మార్పులు, చేర్పులు చేసి రూపొందించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి కౌన్సిల్‌కు సూచించారు. బడ్జెట్‌లో పావు వంతు మైనార్టీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు, మరో పావు వంతు ప్రజాసౌకర్యాలైన పార్క్, క్రీడా మైదానాలు, కూడళ్ల సుందరీకరణ, వంటి పనులకు కేటాయించాలన్నారు. పట్టణంలో పారిశుధ్యం కోసం కార్మికులకు ప్రణాళిక ప్రకారం విధులు కేటాయించాలని సూచించారు. వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్ మాట్లాడుతూ.. కరెంట్ బిల్లుకు నెలకు రూ.12 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తోందని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు రూ.16 లక్షలు వేతనాల కోసం కేటాయిస్తున్నామన్నారు. ఆర్డీవో రవికుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలికను వేధించిన వ్యక్తికి ఏడాది జైలు

ఆదిలాబాద్‌టౌన్: ప్రేమపేరిట మైనర్ బాలికను వేధింపులకు గురిచేస్తూ ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవికృష్ణ సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2019లో మైనర్ బాలిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో బోథ్‌కు చెందిన గౌతమ్ ఆమె చేయి పట్టుకోవడంతో కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడికి రావడంతో గౌతమ్ పరారయ్యాడు. ఈ విషయంపై కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పీపీ రమణారెడ్డి కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఏడాది జైలు

ఆదిలాబాద్‌టౌన్: కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఏడాదిపాటు జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి సతీశ్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి జాదవ్ ఈశ్వర్‌సింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..2019 అక్టోబర్ 10న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఇందానికి చెందిన కోట్నాక్ విజయ్‌కుమార్‌ను అదే గ్రామానికి చెందిన గుర్నాలే పోశాలు కులం పేరుతో దూషించారు. దీంతో బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా పీపీ కిరణ్‌కుమార్ పది మంది సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. ఈమేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి వివరించారు.

తప్పిన పెను ప్రమాదం



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

ఇచ్చోడ: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం లారీ, బస్సు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నిర్మల్ బైపాస్ ఇచ్చోడ వద్ద 44వ జాతీయ రహదారిపై వెళ్తుంది. ఈ క్రమంలో నాగ్‌పూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి బస్సును ఢీకొంది. దీంతో బస్సు అద్దాలు పగిలిపోయాయి. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కెరమెరి(ఆసిఫాబాద్): ఈ నెల 7న రోడ్డు ప్రమాదానికి గురైన కుమురం సెడ్మారావు (23) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని కెస్లాగూడకు చెందిన సెడ్మారావు ఈ నెల 7న హోలి పర్వదినం సందర్భంగా కొట్నాక కిరణ్ కుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై జైనూర్ మండలం అడ్డేసర గ్రామానికి వెళ్లి వస్తుండగా దేవాపూర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ముందుగా కెరమెరికి, అక్కడినుంచి ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, ఆతర్వాత హైదరాబాద్ లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. కాగా కిరణ్ కుమార్ మంచిర్యాలలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఉపకార వేతనం చదువులకు ఉపయోగం

- 4,081 మంది ఎస్సీ విద్యార్థుల దరఖాస్తులు
- బీసీలు 757 మంది మాత్రమే
- బీసీ విద్యార్థులకు గతేడాది జమకాని నిధులు



సమీకృత ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోంది. జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు వివిధ సంక్షేమ శాఖల ద్వారా ఉపకార వేతనాలు అందజేస్తున్నారు. వీటిలో షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి, గిరిజన, అల్ప సంఖ్యాకుల సంక్షేమ శాఖలు ప్రధానమైనవి. ప్రభుత్వ ఆర్థిక సాయం పొందుతున్న విద్యార్థులు ఉన్నత చదువులపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చినా జిల్లా వ్యాప్తంగా చాలా మంది ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోలేదు. ఈ నెల 31లోగా విద్యార్థులు దరఖాస్తు చేసేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అధికారులు కోరుతున్నారు.

రూ.1000 నుంచి రూ.3వేల వరకు..

6 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ బాలురకు రూ. 1000, బాలికలకు రూ. 1500 చొప్పున చెల్లిస్తారు. 9, 10 తరగతులు చదివే పిల్లలకు ఏడాదికి రూ. 3 వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 4,081 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

బీసీ విద్యార్థులకు రూ.వెయ్యి

సర్కారు బడుల్లో బీసీ విద్యార్థులకు ఆ శాఖ ద్వారా ప్రభుత్వం 9, 10 తరగతుల వారికి రూ.వెయ్యి అందజేస్తోంది. ఈ విద్యా సంవత్సరం 757 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా గత విద్యా సంవత్సరానికి సంబంధించిన డబ్బులు ఇప్పటికి జమా కాకపోవడంతో ఉపకార వేతనానికి చాలామంది దరఖాస్తు చేసుకోలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా పోస్టు మెట్రిక్ చదువుతున్న బీసీ విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో 10,243 మంది ఆన్‌లైన్‌లో ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోగా 6,689 మందికి మంజూరు చేసినట్లు శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మిగతా విద్యార్థులకు సంబంధించిన కళాశాలల యాజమాన్యాలు హార్డ్‌డిస్క్‌లు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్‌లు సకాలంలో కార్యాలయానికి సమర్పించకపోవడంతో మంజూరు కాలేదని చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలోని ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనాలు అందజేస్తోంది. అవి చదువులకు ఉపయోగపడతాయి. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలి. గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి.
– సునీత కుమారి, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి

ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉపకార వేతనాలు పొందేందుకు అర్హులున్నారు. ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు ఉపకార వేతనాల మంజూరు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఆయా పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్య ప్రతినిధులు, విద్యార్థులు నమోదు చేసుకునేలా చూడాలని అధికారులు సూచిస్తున్నారు. బీసీ, ఈబీసీ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఈపాస్ వెబ్‌సైట్‌ను తెరిచి వివరాలను నమోదు చేయాలి. అనంతరం కళాశాల బోనఫైడ్, కులం, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జత చేసి శాఖల అధికారులకు అందజేయాలి. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం, గ్రామీణ ప్రాంత వారికైతే రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికైతే రూ. 2 లక్షలకు మించని వారు ఉపకార వేతనానికి అర్హులుగా పరిగణిస్తారు.

8, 9, 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే..

1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న అల్ప సంఖ్యాక వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం గతంలో ఉపకార వేతనాలు అందజేసేది. జిల్లాలోని సుమారు 6 వేల నుంచి 7 వేల మందికి ప్రయోజనం కలిగేది. కాని ఈ విద్యాసంవత్సరం మాత్రం 8, 9, 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే అందజేస్తోంది. ఆయా తరగతుల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రతి విద్యా సంవత్సరంలో ఫిబ్రవరిలో డబ్బులు విద్యార్థుల ఖాతాలో జమా అయ్యేవి. ఈ ఏడాది ఇప్పటి వరకు జమా కాలేదని వారు ఆందోళన చెందుతున్నారు.

తేనె కోసం వెళ్లి చెట్టుపై నుంచి పడి..

- ఒకరి మృతి



టేకం దేవురావు మృతదేహం

ఉట్నూర్‌రూరల్: తేనె కోసం వెళ్లి చెట్టుపై నుంచి పడి ఒకరి మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై భరత్‌సుమన్ కథనం ప్రకారం.. కామాయిపేటకు చెందిన టేకం దేవురావు (57), లచ్చు, లక్ష్మణ్, బాపురావులతో కలిసి గ్రామ సమీపంలోని వాగు వద్ద గల చెట్టుపై ఉన్న తేనె తీయడానికి ఎక్కారు. దేవురావు ప్రమాదవశాత్తు జారిపడి కిందపడ్డాడు. వెంటనే 108 ద్వారా ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మిబాయితోపాటు ఆరుగురు సంతానం ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురు ఆటో దొంగల అరెస్ట్

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలో ముగ్గురు ఆటో దొంగలను సోమవారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేటకు చెందిన చింతూరు సురేశ్ ఈనెల 6న తన ఇంటి ఎదుట ఆటో పార్కింగ్ చేశాడు. తెల్లవారుజాము చూస్తే కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన ఎస్సై.. వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన దండ్ల నర్సారెడ్డి, దర్శనం హరీశ్, షేక్ షాదుల్‌లు ఆటోను దొంగిలించినట్లు గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావు



గిరిజనుల అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావు

ఉట్నూర్: గిరిజనుల అర్జీలు త్వరగా పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావు అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి 27 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రజావాణిలో పరిష్కారం కాని అర్జీలపై సమీక్షించారు. పరిష్కారానికి నోచని కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, పీఈటీసీ ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, హెచ్‌వో సుధీర్, జేడీఎం నాగభూషణం, ఏడీఎమ్‌హెచ్‌వో బాలు తదితరులు పాల్గొన్నారు.

- తనకు గిరిజన వికాసం పథకం ద్వారా పొలంలో బోరుబావి, విద్యుత్ మోటార్ ఏర్పాటు చేయాలని ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్‌కు చెందిన హీరాలాల్ అర్జీ పెట్టుకున్నాడు.
- తన పంట సాగుకు విద్యుత్ మోటారు, సాగు నీరందించేందుకు పైపులు అందించాలని భీంపూర్ మండలం అంతర్‌గాం గ్రామానికి చెందిన గెడం లక్ష్మి విన్నవించింది.
- విద్యుత్ ప్రమాదంలో ఆరు ఇళ్లు దగ్ధంతో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఐటీడీఏ ద్వారా ఆర్థికసాయం అందించాలని తిర్యాణి మండలం సల్పాలకు చెందిన పద్రం లక్ష్మణ్, రాంబాయి, లీలా, ఆత్రం గిరిజబాయి, తారబాయి వేడుకున్నారు.
- తనకు ఆసరా పింఛన్ అందించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, వెంటనే మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం బీర్సాపెట్‌కు చెందిన కుమ్రం రాంబాయి విన్నవించింది.
- వేసవిలో గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్ జాదవ్ సావిత్రినాయక్ అర్జీ అందించారు.
- తాను జీఎఎం కోర్సు పూర్తి చేశానని, ఐటీడీఏ ద్వారా ఏదైన పీహెచ్‌సీలో ఉద్యోగావకాశం కల్పించాలని కెరమెరి మండలం కొలాంగూడకు చెందిన సిడాం జయ విన్నవించింది.
- తాను సాగు చేసుకుంటున్న పోడుభూమికి హక్కు పత్రం అందించాలని వాంకిడి మండల కేంద్రానికి చెందిన జాదవ్ పరమేశ్వర్ అర్జీ పెట్టుకున్నాడు.

వరాహానికి పాలిస్తున్న గోవు



పందికి పాలు ఇస్తున్న ఆవు

ఖానాపూర్: నంది కడుపున పంది పుడుతుందని వీరబ్రహ్మంగారు చెప్పారు. ఆ వింత జరుగుతుందో లేదో కానీ, నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో ఓ గోవు జాతిభేదం మరచి వరాహానికి పాలిస్తోంది. పట్టణంలోని వీధుల్లో తిరిగే ఓ ఆవు వద్దకు వెళ్లిన పంది పాలు తాగుతూ కనిపించింది. అయినా ఆవు ఏమీ అనకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఉరివేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన వృద్ధురాలు వేములకుర్తి మల్లవ్వ (65) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం..ఈనెల 9న ఇంటి నుంచి వెళ్లిన మల్లవ్వ తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. మతిస్థిమితం లేని మల్లవ్వ గతంలో ఇంటి నుంచి వెళ్లిపోయి నాలుగు రోజుల తర్వాత వచ్చింది. మళ్లీ అలాగే వస్తుందని కుటుంబ సభ్యులు ఎదురుచూశారు. సోమవారం ఉదయం నల్దుర్తి శివారులో టేకుచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విఠపూర్‌లో ఒకరు

కుంటాల: మండలంలోని విఠపూర్ గ్రామానికి చెందిన నెమిలికర్ భోజన్న (45) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం..భోజన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత మూడు నెలల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం గైనోడి చెరువు సమీపాన ఉన్న చెట్టుకు తన చొక్కాతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య కవిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫినాయిల్ తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: దొంగగా భావించి దాడి చేయడాన్ని తట్టుకోలేక పట్టణంలోని నెహ్రూచౌక్‌కు చెందిన యువకుడు బాన్సుడే కిశోర్ ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈనెల 9న అదే కాలనీకి చెందిన మూడు ఆటోల్లోని బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. దీనికి కిశోర్ బాధ్యుడని పేర్కొంటూ అదే కాలనీకి చెందిన సలీం, షన్నులు దాడి చేశారు. తట్టుకోలేక బాధితుడు ఫినాయిల్ తాగగా, గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. బాధితుడి సోదరుడు బాన్సుడే మంగేష్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్సై ఊశన్న తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..



మడావి భీంరావ్ మృతదేహం

బోథ్: మద్యానికి బానిసై ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని మందబొగడ గ్రామానికి చెందిన మడావి భీంరావ్(45) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతకొన్ని రోజులుగా తాగుడుకు బానిసై ఇంట్లో గొడవలు చేస్తున్నాడు. ఈ క్రమంలో భార్య కళాబాయి మందలించడంతో మనస్తాపం చెంది సోమవారం ఉదయం తన చేనులో పురుగుల మందు తాగాడు. భార్య గమనించి వెంటనే బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య కళాబాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి



మాట్లాడుతున్న శోభన్

ఎదులాపురం: కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ, రైతు, కార్మిక సంఘాల నాయకులతో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పాలన చేపడుతోందన్నారు. పరిపాలన పేరుతో ధరలు పెంచుతూ నిలువుదోపిడీ చేస్తోందన్నారు. కేంద్ర విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, కార్మిక, కర్షక సంఘాలతో కలిసి ఏప్రిల్ 5న చలో ఢిల్లీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, కార్మిక, కర్షకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, లంక రాఘవులు, ప్రేమల, రామక్క పాల్గొన్నారు.

‘భట్టి’ పాదయాత్ర విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న చంద్రయ్య

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య కోరారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈనెల 16న బజార్‌హత్నూర్ మండలం పిప్రి నుంచి ఈ పాదయాత్ర ప్రారంభమై ఖమ్మం వరకు కొనసాగుతుందన్నారు. బోథ్ నియోజకవర్గంలో ప్రారంభమై ఖానాపూర్ నియోజకవర్గంలోని సిరికొండ, ఇంద్రవెల్లి మీదుగా 19న ఉట్నూర్ ఎక్స్‌రోడ్డుకు చేరుకుంటుందని అన్నారు. 10 వేల మందితో నిర్వహించే బహిరంగ సభలో ఆయనతోపాటు పార్టీ నేతలు ప్రేంసాగర్ రావు, మహేశ్వర్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఉత్తంకుమార్‌రెడ్డితో పాటు తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే హాజరవుతారని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలను మోసగిస్తూ పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు పెందూర్ ప్రభాకర్, కొమ్ము విజయ్, ఎక్బాల్, జాదవ్ సునీల్, సిరాజ్, దిలీప్ పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి



శ్రీలత (ఫైల్)

భీమిని(బెల్లంపల్లి): అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాండూర్‌లో చోటు చేసుకుంది. కన్నెపల్లి మండలం జన్కాపూర్ గ్రామానికి చెందిన దర్వాజల లచ్చన్న, భాగ్య దంపతుల కుమార్తె శ్రీలత(25)కు తాండూర్‌కు చెందిన పెద్దబోయిన మహేందర్‌తో 2021లో వివాహమైంది. ఆదివారం ఉదయం అత్తగారింటి నుంచి వెళ్లిన శ్రీలత తాండూర్ పాత గోదాంల సమీపంలోని రైల్వేట్రాక్‌పై శవమై కనిపించింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి సోమవారం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పంచనామా నిర్వహించారు. కాగా తన కూతుర్ని భర్త మహేందర్, అత్త గౌరక్క, ఆడపడుచులు అదనపు కట్నం తీసుకురావాలని, పిలలు కావడంలేదని మానసికంగా వేధించేవారని ఆరోపించారు. అత్తింటి వారే చంపి రైలు పట్టాలపై పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సైనికులు ఆరోగ్యంగా ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: సైనికులు ఆరోగ్యంగా ఉంటేనే తమ విధులు సక్రమంగా నిర్వహించగలుగుతారని సమత సైనిక్‌దళ్ సాంస్కృతిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ వాగ్మారే అన్నారు. జిల్లాకేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల భారతీయ బుద్ధవిహార్‌లో సమత సైనిక్ దళ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సైనిక్ దళ్ శిక్షణ తరగతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైనికుడిలా తయారు కావాలన్నారు. దేశంలో ఎలాంటి విపత్కర పరిస్థితి ఏర్పడిన మీ శిక్షణ దేశానికి ఎంతో ఉపయోగమని తెలిపారు. బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబాసాహెబ్ కాంబ్లే మాట్లాడుతూ జిల్లాలో కొందరు గత 20 ఏళ్ల నుంచి సమత సైనిక పేరుపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు శాలిక్‌రావ్, రమాబాయి మహిళా మండల్ సంగ్ జిల్లా అధ్యక్షురాలు తుల్జాపూర్ శోభ, మహర్ బెటాలియన్ నాయకులు వాగ్మారే శైలేందర్, దయానంద్ కాంబ్లే, దాదాసాహెబ్ గిరిబిడే, రాజు, గౌతమ్ పాల్గొన్నారు.

ఏటీఎం చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్‌టౌన్: ఏటీఎం చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై రమణారావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక నగరేశ్వర వాడలోని ఒక ప్రవేట్ ఏటీఎంలో ఆదివారం అర్ధరాత్రి ఏదో శబ్దం వస్తుందని కాలనీవాసులు అక్కడకి వెళ్లారు. ఒకరు ఏటీఎంను సుత్తెతో కొడుతూ కనిపించడంతో ఏం చేస్తున్నావ్ అని అడగగా, రిపేర్ చేస్తున్నానని చెప్పాడు. పోలీసులకు ఫోన్ చేస్తామని చెప్పగానే పారిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. చోరీకి యత్నించిన వ్యక్తి దిల్‌వార్‌పూర్ మండలం లోలం గ్రామానికి చెందిన మేకల శ్రీనుగా గుర్తించి సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

నేరడిగొండ: మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద సోమవారం ఆవులను తరలిస్తున్న మ్యాక్స్ వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. బేల మండలం నుంచి నిర్మల్‌కు (ఏపీ 22ఎక్స్ 3609) బులేరో మ్యాక్స్ వాహనంలో 9 ఆవులు, 3 దూడలను నైలాను తాడుతో క్రూరంగా కట్టి తీసుకెళ్తున్నారు. టోల్‌ప్లాజా వద్ద తనిఖీ చేస్తుండగా గుర్తించారు. వాహనంలో ఉన్న షేక్ సలీం ఖురేషి, సయ్యద్ ఉమర్‌ను అదుపులో తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ఆవులను ఇచ్చోడలోని శ్రీరామ గోశాలకు తరలించినట్లు వివరించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మిస్సింగ్ కేసు

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన అన్నారం లక్ష్మణ్ (29) కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. లక్ష్మణ్ ఈనెల 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. అతని ఆచూకీ కోసం కుటుంబీకులు వెతికినా దొరకలేదు. తండ్రి సాయన్న ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


రీజినల్ లెవల్ వర్క్‌షాప్‌లో ఇద్దరు సర్పంచులు



పాల్గొన్న సర్పంచులు

బోథ్: పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రీజినల్ లెవల్ వర్క్‌షాప్‌లో మండలంలోని పిప్పల్‌ధరి సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, పట్నాపూర్ సర్పంచ్ పంద్రం సుగుణ పాల్గొన్నారు. పాఠశాలల అభివృద్ధి, గ్రామీణాభివృద్ధితో పాటు పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. పలు రాష్ట్రాల నుంచి ఐఏఎస్ అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు.

కరెంట్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి



సంతోష్(ఫైల్)

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ శివారులోని పంట చేనులో కరెంట్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. రూరల్ ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. మంజులాపూర్‌కు చెందిన గరగడి సంతోష్ (33) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. తుమ్మల కిరణ్‌కు చెందిన పంట చేనులో ఎరువు చల్లడానికి సోమవారం సంతోష్ పనికి వెళ్లాడు. ఎరువు చల్లుతుండగా పక్కనే ఉన్న వ్యవసాయ మోటారుకు ఉండే జియా వైర్ తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది. నిర్లక్ష్యంగా వ్యవరించిన భూ యజమానిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై పేర్కొన్నారు.

మతోన్మాదంపై రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడెం: మతోన్మాదంపై రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా ప్లీనరీలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదిలాబాద్‌లో ఈనెల 23న యాత్ర ప్రారంభమై నిర్మల్ చేరుకుంటుందన్నారు. నిర్మల్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నూతన్‌కుమార్, తిరుపతి, వీరయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎగిసిపడిన మంటలు



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని మదీనాకాలనీలో సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగింది. స్థానికంగా ఉన్న ఖాళీ స్థలంలో ఎండిపోయిన కర్రలు, చెత్తకు నిప్పంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. జనావాసాల మధ్య నిప్పు రాజుకోవడంతో స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకుని మంటలార్పివేయడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.